క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణాలను నిలబెడదాం

చక్రాయపేట : మనం ఇచ్చే దానంగా ఇచ్చే రక్తం మరో వ్యక్తికి ప్రాణాన్ని నిలబెడుతుందని ట్రిపుల్ ఐటీఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ప్రోగ్రాం అధికారి విశ్వనాథరెడ్డి పేర్కొ న్నారు. మండలంలోని కుమార్లకాల్వ గ్రామం చెరువుకాంపల్లెలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహను తొలగి పోయేలా అవగాహణ కల్పించారు. అనంతరం ట్రిపుల్ఐటీ విద్యార్థులు, గ్రామస్తులు రక్త దానం చేశారు.

ఆధార పత్రాలు సమర్పించండి

పులివెందుల టౌన్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా రోడ్ల విస్తరణకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యిందని.. భూసేకరణకు సంబంధించిన పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత భూ యజమానులు అందించాలని తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఎమ్మెల్యే, కలెక్టర్ రాక

వీరపునాయునిపల్లె : మండలంలోని తంగెడుపల్లె గ్రామంలో శనివారం కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఆర్టికల్చర్, వ్యవసాయ శాఖ అధికారులు రానున్నట్లు మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. పంట నష్టపోయిన రైతులు తమ పొలాల వద్ద ఉండాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ కోతలు

లింగాల : మండల కేంద్రమైన లింగాల 132/32కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా లింగాల, చిన్నకుడాల, గుణకనపల్లె, కోమన్నూతల, తాతిరెడ్డిపల్లె, పార్నపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ రంగానికి సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రమేష్‌బాబు తెలిపారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.

37.4మి.మీ. వర్షపాతం

కమలాపురం : మండలంలో 37.4 మి.మీ. వర్షపాతం నమోదు అయినట్లు మండల తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. తుఫాన్ కారణంగా శనివారం రాత్రి భారీగా వీచిన గాలులతో పాటు భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు ఈ వర్షం కురవడంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ గాలులు వీచడంతో కుప్పూరివారిపల్లె వద్ద ఐదు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రబోధ సేవాసమితి ప్రచారం

ముద్దనూరు : ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని తిమ్మాపురం, రాజులగురువాయిపల్లె గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంధాన్ని ప్రచారం చేశారు. పులివెందులకు చెందిన ఇందూ జ్ఞానవేదిక కమిటీ ఉగాది పర్వదినం రాక సందర్భంగా పండుగ ప్రాముఖ్యాన్ని, భగవద్గీత సారాంశాన్ని వారు ప్రచారం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

31న దేశవు ఎద్దుల బండలాగుడు పోటీలు

పులివెందుల టౌన్ : ఈనెల 31వ తేదీన శ్రీరామ నవమిని పురస్కరించుకుని దేశవు ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘ కార్యాలయంలో సంఘ సభ్యులతో కలిసి ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా దేశవు ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నామని.. ఈ పోటీలలో పాల్గొనేవారు ఎద్దుల యజమానులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9866599455, 9441135977 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దండుపల్లి గ్రామంలో కూలిన మిద్దె



కూలిపోయిన మిద్దె

ఎర్రగుంట్ల : మండల పరిధి సిర్రాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దండుపల్లి గ్రామంలో ఆదివారం వర్షానికి ఎర్రగొర్ల కృష్ణయ్య నివాసం ఉండే మిద్దె కూలిపోయింది. ఈ ప్రమాదంలో కృష్ణయ్య, అతని భార్య వెంకటలక్షుమ్మలు స్వల్పంగా గాయపడ్డారు. 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు.

అకాల వర్షాలు.. దెబ్బతిన్న పంటలు

- నేలకొరిగిన అరటి, జొన్న, బొప్పాయి
- పంటలను పరిశీలించిన పులివెందుల ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలో పులివెందుల, లింగాల, వేంపల్లె మండలాల్లో అకాల వర్షానికి వందలాది ఎకరాలలో రైతులు సాగు చేసిన అరటి, చీనీ చెట్లు నేలకొరిగాయి. మరో పది రోజుల్లో అరటి పంట కోతకు వచ్చే సమయంలో అకాలవర్షం రైతుల ఆశలను అడియాశలు చేసింది. శుక్ర, శని వారాలలో కురిసిన వర్షాలకు నియోజకవర్గంలోని 420 మంది రైతులకు సంబంధించి అరటి, చీనీ, నిమ్మ, తమలపాకు, బొప్పాయి, మామిడి చెట్లు నేలకొరిగాయి. దెబ్బతిన్న పంటల వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేశారు.

వేంపల్లెలో..

వేంపల్లె : వేంపల్లెలో శనివారం కురిసిన ఈదురుగాలులు, వర్షానికి దెబ్బతిన్న పంటలను పులివెందుల పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆదివారం ఉదయం జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రిలతో కలిసి వేంపల్లె మండలంలోని అమ్మగారిపల్లె, వేంపల్లె, ఇడుపులపాయ, తంగేడుపల్లె గ్రామ పొలాలను సందర్శించారు. పెనుగాలులు, వడగండ్లకు దెబ్బతిన్న అరటి, చీనీ, నిమ్మ, మామిడి, తమలపాకు, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలను పరిశీలించి వ్యవసాయ అధికారులకు పలు సూచనలు చేశారు. అందుకు అధికారులు స్పందించి ప్రాథమిక అంచనా ప్రకారం 702 మంది రైతులకు సంబంధించి 255 ఎకరాల అరటి తోటలు, 12 మంది రైతులకు సంబంధించి 30 ఎకరాల చీనీ తోటలు, 63 మంది రైతులకు సంబంధించి 141 ఎకరాల నిమ్మ తోటలు, 78 మంది రైతులకు సంబంధించి 132 ఎకరాల తమలపాకు తోటలు, 138 మంది రైతులకు సంబంధించి 583 ఎకరాల మామిడి తోటలు, ఇద్దరు రైతులకు చెందిన 3 ఎకరాల బొప్పాయి, ఒక్క రైతుకు సంబంధించి 2 ఎకరాల మునగ పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 396 మంది రైతులకు సంబంధించి వివిధ రకాల పంటలు 1146 ఎకరాలు దెబ్బతిన్నాయన్నారు. అయితే తంగేడుపల్లె గ్రామ పొలంలో బి.చక్రపాణిరెడ్డి అనే రైతు 25 ఎకరాలలో అరటి సాగు చేశారు. పూర్తిగా పంట నేలమట్టం కావడంతో రూ.2 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఓ రెడ్డయ్య, ఏఓ రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ కటిక చంద్రశేఖర్, వార్డు మెంబర్లు ఆంజనేయులు, రమేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.



వేంపల్లె : దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



వీరపునాయునిపల్లె : తంగేడుపల్లెలో నేలకొరిగిన అరటి పంట

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని తంగెడు గ్రామంలో శనివారం కురిసిన వర్షం, గాలులకు సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ పంటలను ఆదివారం పులివెందుల ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. దెబ్బతిన్న పంటలకు ఎంతనష్టం జరిగిందో నివేదిక తయారు చేసి త్వరగా అందించాలన్నారు. నివేధిక అందగానే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు పంట నష్ట పరిహారం అందేందుకు కృషి చేస్తానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. చీనీనిమ్మ, సన్న నిమ్మ 200 ఎకరాలు, అరటి 50 ఎకరాలు, నూగు పంట 300 ఎకరాల్లో దెబ్బతినిందని రైతులు తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో ఇలా జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 100కు పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు వారు తెలిపారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని వీరపునాయునిపల్లె మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, తంగెడుపల్లె ఎంపీటీసీ వీరభద్రారెడ్డి, ఆర్టికల్చర్ అధికారి రెడ్డెయ్య, స్థానిక నాయకులు, పలువురు రైతులు ఆయన వెంట ఉన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : ఆకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం అదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని లింగారెడ్డిపల్లి, లక్కిరెడ్డిపల్లి గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను రైతు సంఘం నాయకులు పరిశీలించి మాట్లాడారు. దెబ్బతిన్న పంటలను రైతు భరోసా కేంద్రం అధికారులు పంటనష్టం అంచనా వేయాలన్నారు. తడిసిన పసుపు ధాన్యాన్ని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం నాయకులు శ్రీనివాసులురెడ్డి, గోపాలకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. మండల పరిధిలోని లేబాక గ్రామ పొలాలో దెబ్బతిన్న వరి పంటను కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. పంట నష్టం వివరాలను గురించి రైతులతో ఆరా తీశారు. రైతులకు న్యాయం చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలో శనివారం వర్షానికి సాగులో ఉన్న అరటి, చీనినిమ్మ, తదితర పంటలు దెబ్బతిన్నాయి. సోగాల్‌పల్లె తువ్వపల్లె, కొత్తగంగిరెడ్డిపల్లె, నందిమండలం తదితర గ్రామాలల్లో సాగులో ఉన్న దాదాపు 40 ఎకరాల్లో దాదాపు రూ.10 లక్షలు నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి అరటి పంట నేలకూలింది. కోవరంగుంటపల్లెకు చెందిన శివ, తొండూరుకు చెందిన వెంకటేష్ అనే ఇరువురు రైతులు బలపనూరు పొలంలో 6 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని అరటి పంటను సాగు చేశారు. అయితే రైతులు ఆశించినట్లు దిగుబడి బాగా ఉంది. నెల రోజులలో అరటి కాయలు కోతకు వచ్చి మంచి ఆదాయం వస్తున్న సమయంలో వర్షానికి అరటి పంట నేలకూలింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నేలకొరిగిన అరటి, జొన్న, బొప్పాయి

ముద్దనూరు : అకాల వర్షం రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. శనివారం రాత్రి మండలంలో కురిసిన భారీ వర్షం, తీవ్ర గాలులు వల్ల అరటి, బొప్పాయి, జొన్న, కొర్ర తదితర పంటలు నేలకొరిగాయి. తీవ్రమైన గాలితో పొలాల్లో పంటలు నేలకొరిగి దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు. ఆరవేటిపల్లె, దేనేపల్లె, బొందలకుంట, చింతకుంట గ్రామాల్లో పంటలకు నష్టంవాట్లింది. ఆరవేటిపల్లె గ్రామంలోనే సుమారు 70 ఎకరాల్లో అరటి పంటకు పూర్తిగా నష్టం వాటిల్లినట్లు, 15 ఎకరాల్లో బొప్పాయి పంట దెబ్బతిన్నట్లు అధికారులు అంచనావేశారు. అరటికి మార్కెట్‌లో మంచి ధర వున్న సమయంలో వర్షం, గాలుల వల్ల పంట దెబ్బతినిందని, దీంతో 70 ఎకరాల్లో కోట్లాది రూపాయల నష్టం జరిగిందని అరటి రైతులు వాపోతున్నారు. చింతకుంట గ్రామంలో సుమారు 100 ఎకరాల్లో జొన్న పంట తీవ్ర గాలులు వల్ల నేలకొరిగింది. అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆరవేటిపల్లెలో నేలకొరిగిన అరటిపంట



బోదలకుంటలో రాలిపోయిన బొప్పాయి

కులమతాలకతీతంగా అభివృద్ధి



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి, తదితరులు

లింగాల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కులమతాలకతీతంగా అభివృద్ధి జరుగుతోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కర్ణపాపాయపల్లె గ్రామ సమీపంలో ఉన్న నిత్యపూజకోనలో భూలింగేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఎండోమెంట్ ద్వారా మంజూరైన రూ.75లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఆలయానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వైఎస్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దేవాలయాలు, మసీదులు, చర్చిలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్ణా రమేష్‌కుమార్‌రెడ్డి, పులివెందుల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం



మహిళలకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శ్రీసత్య సాయి కళ్యాణ మండపంలో ఆదివారం బ్యాంకర్ల గ్రామీణ, మరియు ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ సౌజన్యంతో శ్రీసత్యసాయి సేవా సంస్థల సహకారంతో టైలరింగ్ అండ్ ఫ్యాషన్ డిజైనింగ్‌లపై ఉచిత వృత్తి శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సత్య సాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావులు ముఖ్య అతిథులుగా హాజరై 40 రోజులు పూర్తి చేసుకున్న మహిళా యువతులకు సర్టిఫికెట్లను ప్రదా నం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమ ఇన్‌చార్జి నాగప్రసాద్, జిల్లా అధ్యక్షులు సురేంద్ర, రాష్ట్ర సేవాదళ్ కో ఆర్డినేటర్ హెచ్.సురేంద్ర, కన్వీనర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు వాసికి జాతీయ పురస్కారం



డాక్టర్ సత్తెనపల్లి బాబును సన్మానిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు రూరల్ : ప్రముఖ రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ సత్తెనపల్లి బాబు ఆదివారం బెంగుళూరులో జాతీయ పురస్కారాన్ని అందుకున్నాడు. ఈయన రాసిన బసవ పురాణం–ఒక పరిశీలన అన్న పుస్తకం శోభకృతునామ ఉగాది జాతీయ పురస్కారానికి ఎంపికైంది. కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఇండోనేషియా అకాడమీ విద్యా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో ఆయనను సత్కరించి ఈ అవార్డును ప్రదానం చేశారు. సమాఖ్య చైర్మన్ మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర శాస్త్రీల ఆధ్వర్యంలో సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా డాక్టర్ బాబు ఆదివారం బెంగుళూరులో పురస్కారాన్ని అందుకున్నారు.

సీజీఆర్ గణిత ప్రతిభా పరీక్షకు స్పందన

పులివెందుల టౌన్ : పట్టణంలోని రమణప్ప సత్రం బడి ఉన్నత పాఠశాలలో ఆదివారం పులివెందులకు చెందిన ఎస్ఆర్ఐ సి.మధుసూదన్‌రెడ్డి తండ్రి, రిటైర్డు హెడ్మాస్టర్ సి.గంగిరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన సీజీఆర్ నియోజకవర్గస్థాయి గణిత ప్రతిభా పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. ఈ పరీక్షను ఇంగ్లీషు, తెలుగు మీడియంలలో నిర్వహించారు. ఈ పరీక్షకు 9, 10వ తరగతులకు చెందిన 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. పదవ తరగతి ఆంగ్ల మాధ్యమంలో నవ్య, గాయత్రి, వైష్ణవిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లోనూ.. తెలుగు మాధ్యమంలో ఊహప్రియ, గంగోత్రి, సిద్దేశ్వరరెడ్డి మొదటి, రెండవ, మూడవ స్థానాల్లోనూ.. అలాగే 9వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో భార్గవ్, హారిక, గ్రీష్మలు మొదటి, రెండవ, మూడవ స్థానాలలో నిలవగా.. 9వ తరగతి తెలుగు మాధ్యమంలో వైభవ్ రెడ్డి, శివ స్నేహ, గంగా సౌమ్యలు ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారు. వీరికి మధుసూదన్‌రెడ్డి మిత్రులు మధుసూదన్‌రెడ్డి, వైఎస్ వెంకటరెడ్డి, నరసింహారెడ్డి, గోపాల్‌రెడ్డిలు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ నాగిరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి, పరీక్షా నిర్వాహకులు గుజ్జుల కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, సేవా సమితి అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్య ప్రదర్శనలో యువకులు



జానపద నృత్యంలో చిన్నారులు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంస్కృతి ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎస్‌కే డ్యాన్స్ స్టూడియో, భాష్యం స్కూలు సంయుక్తంగా శ్రీశర్వన్, నంద డ్యాన్స్ మాస్టర్ల ఆధ్వర్యంలో చిన్నారుల జానపద, వెస్టన్, నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. తదితర పాటలకు చిన్నారుల నృత్యాలను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

ముగిసిన గంగమ్మ జాతర



గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లి సమీపంలో వెలసిన గంగమ్మతల్లి ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. నాల్గవ ఆదివారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామున 3 గంటల నుంచి బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈఓ సురేష్‌కుమార్ ఏర్పాట్లను చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీకేదిన్నె ఎస్ఐ అరుణ్‌రెడ్డి బందోబస్తును ఏర్పాటు చేశారు.

పెద్దమ్మతల్లి దేవర



దేవరలో పాల్గొన్న గ్రామస్తులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిన్నదండ్లూరు గ్రామంలో ఆదివారం పెద్దమ్మతల్లి దేవరను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని నడివూరులో పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి దేవరకు హాజరై పెద్దమ్మతల్లికి పూజలు నిర్వహించారు. పోలీసులు బందోబస్తును నిర్వహించారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

వేంపల్లె : మండలంలో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురవడంతో చాలా చోట్ల భారీ వృక్షాలు, కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో చాలా చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదివారం విద్యుత్ శాఖ ఎస్ఈ ఆదేశాల మేరకు డీఈలు రమేష్‌రెడ్డి, శ్రీకాంత్, ఏఈ చంద్ర, విద్యుత్ సిబ్బంది కలిసి హుటాహుటిన అక్కడికి చేరుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేశారు. వ్యవసాయ రైతులకు సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా నేలమట్టమయ్యాయి. త్వరలోనే వీటి సమస్య పరిష్కారం చేస్తామని వారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ

చెన్నూరు : స్థానిక గంగమ్మ ఆలయంలో ఆదివారం జాతరను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి గంగమ్మ తల్లికి మహిళలు బోనాలు సమర్పించారు. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో సీకేదిన్నె జెడ్పీటీసీ సభ్యులు నరేన్ రామాంజులురెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు



గ్రామోత్సవంలో చౌడేశ్వరీదేవి అమ్మవారు

వల్లూరు : మండలంలోని వెంకటాపురం వీవర్స్ కాలనీలోని చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున 2 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి పులి వాహనంపై కొలువుదీరి భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు బలిదానాలను ఇచ్చారు. గ్రామోత్సవంలో భక్తులు జ్యోతులను తలపై పెట్టుకుని విన్యాసాలను చేశారు.

దుగ్గాయపల్లెలో ఉత్సవాలు ప్రారంభం

దుగ్గాయపల్లెలో చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గ్రామంలో చల్ల కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి జ్యోతుల తయారీని ప్రారంభించారు. ఏపీఎస్ ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో నిర్మిస్తున్న గంగమ్మ ఆలయ పనులను ఆయన పరిశీలించారు.

ఘనంగా ముద్దల పండుగ



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు



పాతసంగటిపల్లెలో సిరిబండితో గ్రామస్తులు

కమలాపురం : గంగమ్మ.. మమ్మల్ను చల్లగ చూడవమ్మా అంటూ భక్తులు స్థానిక మార్కెట్‌వీధిలో వెలసిన గంగమ్మతల్లిని వేడుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచే కాక సమీప ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు గంగమ్మకు బోనాలు తీసుకొచ్చి చల్ల ముద్దలు ఏర్పాటు చేసి, జంతు బలులు ఇచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కోగటం, కె.అప్పాయపల్లె, జీవంపేట, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, పొడదుర్తి, ఎర్రబల్లె, నల్లింగాయపల్లె, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, సంబటూరు, జంభాపురం గ్రామాలలో ప్రజలు ఘనంగా ముద్దల పండుగ చేసుకున్నారు. బంధువులు, సన్నిహితులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని నాగాయపల్లె, కారపురెడ్డిపల్లె, కొండూరు, కొత్తసంగటిపల్లె, మద్రిమాకులపల్లె, రేపల్లె, పగడాలపల్లె, చెన్నంరాజుపల్లె, గంగులయ్యగారిపల్లె, మాచునూరు తదితర గ్రామాలల్లో ప్రజలు ముద్దల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గ్రామదేవతలు గంగమ్మ, అంకాలమ్మ, పోలేరమ్మలకు భక్తులు పూజలు చేసి ఇళ్ళల్లో చల్లముద్దలు ఏర్పాటు చేసుకుని జంతువులను బలి ఇచ్చి విందు భోజనాలు ఆరగించి బంధు మిత్రులతో సంతోషంగా గడుపుకున్నారు. పాత సంగటిపల్లె గ్రామంలో గ్రామ దేవత జాతర ఎద్దులచే సిరిబండి కట్టి వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందో బస్తు నిర్వహించారు.

వైభవంగా మల్లేల ఇమాంబి ఉరుసు



కవ్వాళి పోటీలను వింటున్న భక్తులు

తొండూరు : మల్లేల శ్రీసయ్యద్ ఇమాంబి ఉరుసు మహోత్సవాన్ని ఆదివారం దర్గా కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కడప జిల్లా నుంచే కాకుండా అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కర్నూలు తదితర జిల్లాలతోపాటు కర్నాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి చదివింపులు చల్లించి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. రాత్రి కవ్వాళి పోటీలు ఘనంగా నిర్వహించారు. బెంగుళూరుకు బెల్గాంకు చెందిన అర్షియన్ నాజ్, అలాగే ముంబాయికి చెందిన మెయిన్ నాజ్‌ల ఖవ్వాళి పోటీలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దర్గా కమిటీ, సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ హనుమంతులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా గ్రామ దేవర

మండల పరిధిలోని సంతకొవ్వూరు గ్రామంలో గ్రామ దేవరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుండే గ్రామ నడి బొడ్డున ఉన్న పెద్దమ్మ అమ్మవారితోపాటు గ్రామంలోని ఉన్న అంకాలమ్మ, గంగమ్మ తదితర దేవాలయాల్లోని అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మ తల్లి చల్లగా చూడమ్మా అంటూ గ్రామస్తులు వేడుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు బండి రామమునిరెడ్డి, మాజీ మండలాధ్యక్షురాలు వడ్డారపు గంగా నీలావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగరాజులు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమాలలో రాష్ట్ర డైరెక్టర్లు రవీంద్రారెడ్డి, శివశంకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, జిల్లా కార్యదర్శులు బండి రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, షఫి, ఎంపీటీసీ ఓబులేసు, మాజీ ఎంపీటీసీలు వెంకట్రామిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాల గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూఏ నూతన కార్యవర్గం ఎంపిక

జమ్మలమడుగు : జమ్మలమడుగు ఆర్టీసీ డిపో ఎన్ఎంయూఏ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నూతన కమిటీ ఎంపిక నిర్వహించారు. డిపో అధ్యక్షుడిగా పి.బ్రహ్మం, కార్యనిర్వాహకుడు అధ్యక్షులుగా ఎం.జి.సి.ఒ.రెడ్డి, డిపో కార్యదర్శిగా శివుడును ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.శివారెడ్డి, రీజనల్ కార్యదర్శులు నాగముని, పి.సుధాకర్, సిసిఎస్ డెలికెట్ కాంతయ్య, గ్యారేజి కార్యదర్శి వలి తదితరులు పాల్గొన్నారు.